సంపుటి : 10
సంచిక : 16
సోమవారం
12 అక్టోబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT


CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలకు

ప్రధాని మోదీ సందేశం



ప్రత్యేక శుభాకాంక్షలతో లేఖ!

ఇంటర్నెట్ డెస్క్, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : బెజవాడ కనకదుర్గమ్మ దసరా నవరాత్రుల వేళ అట్టహాసంగా ప్రారంభమవుతున్న విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక సందేశాన్ని పంపారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక వికాసానికి ప్రధాన కేంద్రంగా ఉందంటూ, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రధాని తన ప్రత్యేక అభినందనలు తెలిపారు. విజయవాడ ఉత్సవ్ నిర్వహణ వల్ల స్థానిక పారిశ్రామికవేత్తలకు సూతన అవకాశాలు లభించడమే కాకుండా, రాష్ట్ర పర్యాటక రంగానికి సరికొత్త ఉత్తేజం లభిస్తుందని మోదీ తన లేఖలో ఆకాంక్షించారు. విజయవాడ ప్రజలకు, వారి ప్రాచీన సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ ఉత్సవాలు మరింత బలోపేతం చేస్తాయని పేర్కొంటూ, కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు విజయవాడ నగరంలోని సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం, కృష్ణా తీరంలోని పున్నమిఘాట్, సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణాల వేదికగా ఈ విజయవాడ ఉత్సవ్ 2.0 సంబరాలు అంబరాన్నంటేలా సాగనున్నాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం సాయంత్రం ఈ వేడుకలను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి పెద్దపీట వేస్తూ విజయవాడ ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటేలా ఈ ఉత్సవాలు రూపుదిద్దామని స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్థానిక కళాకారులను ప్రోత్సహించేందుకు పలు రకాల సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని, సినీ రంగానికి చెందిన ప్రముఖులు, నటీనటులు ఈ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొననున్నారని వివరించారు. నగర విశిష్టతను, సంస్కృతిని నలుదిశలా చాటిచెప్పేలా విజయవాడ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయం. అయితే కేవలం మైకులు, రంగరంగుల అలంకారాల హడావుడికే పరిమితం చేయకుండా, స్థానిక పర్యాటక రంగ అభివృద్ధికి, వ్యాపారులకు నిజమైన ఆర్థిక పురోగతిని అందించే దిశగా ఈ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడమే పాలకుల ప్రాథమిక బాధ్యత!

ఇంద్రకీలాద్రిపై వైభవంగా

దసరా నవరాత్రులు

బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



విజయవాడ, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల తొలిరోజున కనకదుర్గమ్మ వారు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఉత్సవాల తొలిరోజైన ఆదివారం తెల్లవారుజామునే అలయ అర్చకులు అమ్మవారికి పవిత్ర స్నపనాభిషేకం, విలాసవం తమైన అలంకార పూజలు, ప్రత్యేక మంత్రో చ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజా క్రతువు అనంతరం ఉదయం 8 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి, ప్రత్యేక క్యూలైన్లలోకి అనుమతించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో రోజూ ఉదయం 4 గంటల నుంచే భక్తులకు దుర్గమ్మ దర్శన భాగ్యం కల్పిస్తున్నామని, రాత్రి 11 గంటల వరకు దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతాయని దేవస్థానం అధికారులు వెల్లడించారు. తొలినాడు అమ్మవారి బాలారూపాన్ని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తడంతో క్యూలైన్లు కిట కిటలాడాయి. ఏటా దసరా నవరాత్రుల వేళ లక్షలాది మంది భక్తులు అమ్మవారి మిగతా .. 2లో..

స్థానిక సమరానికి సిద్ధం

పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు వర్చువల్ భేటీ, దిశానిర్దేశం!



అమరావతి, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కసరత్తును తీవ్రతరం చేశారు. రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అభ్యర్థులు మరియు ముఖ్యాతి ముఖ్యమైన పార్టీ నాయకులతో ఆయన అమరావతి నుంచి ప్రత్యేక వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎన్నికల యుద్ధంలో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయి ప్రణాళికలపై శ్రేణులతో ఆయన విస్తృతంగా చర్చించారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య కింది స్థాయి వరకు సమన్వయం పక్కాగా ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను, దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టేలా కేడర్ అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని చూసి అలసత్వం వహించకుండా, స్థానిక సంస్థల్లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాలనే పట్టుదలతో చంద్రబాబు పావులు కదుపుతున్నారు. నాయకులు కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, కూటమి భాగస్వాములను కలుపుకొని క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తేనే స్థానిక సమరంలో ఏకపక్ష విజయం సాధించడం సాధ్యమవుతుంది!

అంబానీ వర్గాల వ్యాఖ్యలు

అర్థరహితం

భారత ఇంటర్నెట్ మార్కెట్‌పై ఎలాన్ మస్క్ తీవ్ర ఆగ్రహం!



అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : శాటిలైట్ ఇంటర్నెట్ దిగ్గజం 'స్టార్‌లింక్' అధినేత ఎలాన్ మస్క్ భారత పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ లక్ష్యంగా మళ్లీ విమర్శల బాణాలు విసిరారు. అంబానీకి మద్దతుగా నిలిచే వర్గాలను 'అంబానీ డిజిటల్ ఇంటర్నెట్ సైన్యం'గా సంబోధిస్తూ, వారు చేస్తున్న వ్యాఖ్యలు కేవలం అర్థరహితమని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. ఒకవైపు మిగతా .. 2లో..

స్థానిక ఎన్నికల్లో బలం ఇస్తే నియోజకవర్గాన్ని

మరింత అభివృద్ధి చేస్తాం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



పోలవరం జిల్లా, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : పోలవరం జిల్లాలో అడవి తల్లి బాట 2.0 కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రారం భించారు. పోలవరం జిల్లా ఏర్పాటయ్యాక తొలి సారిగా అక్కడ పర్యటించిన అయనకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజనులు తయారు చేసే అడవి ఉత్పత్తులు, మార్కెటింగ్ సదుపాయాల గురించి ఆరా తీసిన ఆయన, గిరిజన గ్రామాల్లో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాకోట గ్రామం లోని గిరిజనులతో స్వయంగా మాట్లాడిన పవన్ కల్యాణ్, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. రాకోటను రెవెన్యూ గ్రామం గా మార్చాలని గ్రామ ప్రజలు ఆయనను కోరగా, గిరిజనులు ప్రస్తావించిన అన్ని సమస్యలను దశలవారీగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల స్థిందికీ పక్కా రోడ్లు వేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే మిగతా .. 2లో..

తప్పు చేసినవారు చట్టం నుంచి

తప్పించుకోలేరు

మాజీ సీఎం జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం!



అమరావతి, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, స్వార్థ రాజకీయ లబ్ధి పొందడమే వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నైజమని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో ఘాటుగా ఆక్షేపించారు. తనపై ఉన్న తీవ్రమైన ఆర్థిక నేరాల కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ నిత్యం రకరకాల నాటకాలాడుతున్నారని ఆయన మండిపడ్డారు. షెల్ కంపెనీల ద్వారా వేల కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులను మళ్లించిన వ్యవహారంపై ఈడీ విచారణ మరింత వేగవంతం కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సీబీఐ కోర్టుల్లో ఇప్పటికే దాదాపు 4 వేలకు పైగా డిశ్చార్జ్ పిటిషన్ల దాఖలు చేస్తూ విచారణ ప్రక్రియను కావాలనే ఏళ్ల తరబడి సాగదీస్తున్నారని దుయ్యబట్టారు. కేసులు సీబీఐ కేసులు విచారణలో ఉన్నంత మాత్రాన ఈడీ విచారణ ఆగిపోదని, మిగతా .. 2లో..

ద్వారపూడి బ్రిడ్జి వద్ద ఆర్టీసీ డ్రైవర్ల ఇష్టారాజ్యం!

షెల్టర్లున్నా ఆగనే బస్సులు.. ప్రయాణికులకు పరుగులు తప్పని తిప్పలు!



మండపేట (విశ్వం వాయిస్ న్యూస్)

- 200 మీటర్ల దూరంలో బస్సుల నిలుపుదల.. రోడ్డపై ప్రయాణికుల పరుగు పందెం
- అదుపుతప్పి కిందపడుతున్న వృద్ధులు, మహిళలు.. సమయానికి కాలేజీకి చేరలేక విద్యార్థుల అవస్థలు
- అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మళ్లీ మొదటికొచ్చిన దుస్థితి
- ఉన్నతాధికారులకు బీజేపీ నేత కంకటాల మురళీకృష్ణ ఫిర్యాదు.. శాశ్వత చర్యలకు డిమాండ్

మండపేట (విశ్వం వాయిస్ న్యూస్): ప్రయాణికుల భద్రతను, కనీస సౌకర్యాలను గాలికొదిలేసి ఆర్టీసీ డ్రైవర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండపేట రూరల్ పరిధిలోని ద్వారపూడి బ్రిడ్జి (జెడ్.మేడపాడు వంతెన) వద్ద ఆర్టీసీ బస్సులు నిర్దేశిత బస్టాప్‌లలో ఆగకపోవడంతో నిత్యం ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

షెల్టర్ల అలంకారప్రాయం.. 200 మీటర్ల నరకయాతన: మండపేట, రామచంద్రపురం వైపు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో దివంగత మాజీ ఎమ్మెల్యే వి.వి.ఎస్.ఎస్. చౌదరి బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఎండనక, వాననక గంటల తరబడి ప్రయాణికులు ఇక్కడే బస్సుల కోసం పడిగాపులు కాస్తుంటారు. అయితే డ్రైవర్లు మాత్రం బస్టాప్‌ను పూర్తిగా విస్మరించి, ఏకంగా 200 మీటర్ల దూరంలో బస్సులను నిలుపుతున్నారు. దీంతో చేతిలో లగేజీలతో బస్సును అందుకోవడానికి ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సి వస్తోంది.

తీవ్ర ఇబ్బందుల్లో సామాన్యులు: **వృద్ధులు, మహిళలు:** బస్సు వెళ్లిపోతుందన్న ఆందోళనతో పరుగులెడుతూ పలువురు రోడ్డుపై అదుపుతప్పి కిందపడి

(మొదటిపేజీ తరువాయి)

ద్వారపూడి బ్రిడ్జి వద్ద ఆర్టీసీ డ్రైవర్ల ఇష్టారాజ్యం!

తీవ్ర గాయాలపాలవుతున్నారు.

విద్యార్థుల ఆందోళన: ద్వారపూడి పరిసర గ్రామాల నుంచి రామచంద్రపురంలోని వీఎస్ఎం కళాశాలకు వెళ్లే విద్యార్థులు రోజూ సకాలంలో కాలేజీకి, పరీక్షలకు చేరుకోలేక తీవ్ర విద్యా నష్టాన్ని ఎదుర్కొంటున్నారు.

చిన్నపిల్లల తల్లులు: చంటిపిల్లలను, బరువైన బ్యాగులను మోసుకుంటూ ట్రాఫిక్ మధ్యలో పరుగులెత్తడం తీవ్ర ప్రమాదాలకు దారితీస్తోంది.

పర్యవేక్షణ కరవు.. మళ్లీ పాత పద్ధతే:

గతంలో ఇదే తీవ్ర సమస్యపై బీజేపీ నాయకుడు కంకటాల మురళీకృష్ణ జిల్లా కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఉన్నతాధికారులు స్పందించి బస్టాప్ వద్ద ప్రత్యేక సిబ్బందిని కాపలా ఉంచడంతో కొద్దిరోజులు బస్సులు సక్రమంగా ఆగినా, పర్యవేక్షణ సడలడంతో డ్రైవర్లు మళ్లీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్:

ఈ దారుణ పరిస్థితిపై బీజేపీ నాయకుడు కంకటాల మురళీకృష్ణ తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మనోహర్‌తో పాటు రామచంద్రపురం డిపో మేనేజర్‌కు ఫోన్ ద్వారా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కేవలం తాత్కాలిక హామీలతో సరిపెట్టకుండా, బస్సులు తప్పనిసరిగా పెట్టర్ వద్దే ఆగేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్లపై చర్యలు తీసుకుని ప్రయాణికుల రక్షణకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అంబానీ వర్గాల వ్యాఖ్యలు అర్థరహితం

అంబానీ ఇచ్చే చవకైన ఇంటర్నెట్ ధరల ముందు స్టార్‌లింక్ అసలు పోటీపడలేదని చెప్పినే, మరోవైపు స్టార్‌లింక్ రాకతో తమ వ్యాపారానికి ఎక్కడ ముప్పు వస్తుందో అని భయపడుతుండటం వారి ద్వంద్వ విధానాలకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. స్టార్‌లింక్ భారత మార్కెట్‌లోకి వస్తే ఇక్కడి వినియోగదారులకు నాణ్యమైన సేవలతో పాటు మరిన్ని రాయితీలు లభించి లబ్ధి చేకూరుతుందని మస్క్ స్పష్టం చేశారు. భారత మార్కెట్‌లో మనుగడ సాగించాలంటే స్టార్‌లింక్ ధరలు సామాన్యులకు అందుబాటులోనే ఉండేలా చూస్తామని, ఒకవేళ ధరలు మరీ ఎక్కువగా ఉంటే అసలు ఇక్కడ ఎవరూ కొనుగోలు చేయరనే ప్రాథమిక సూత్రాన్ని గుర్తుచేశారు. అయితే సెక్యూరిటీ నిబంధనలు, భద్రతా తనిఖీలు ఇంకా పూర్తికాలేదని భారత ప్రభుత్వం ప్రకటనలు చేసినప్పటికీ, మస్క్ మాత్రం కేవలం సేవా ధరల గురించే మాట్లాడుతుండటం విశేషం. గతంలో కూడా మస్క్ ముకేశ్ అంబానీని ఉద్దేశించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్, అల్జజీరా కథనాలను షేర్ చేస్తూ 'అంబానీయే భారత్‌కు అసలైన ప్రధాని' అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రస్తుతం భారత్‌లో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్, భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన వన్‌వెబ్ సంస్థలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఏ ఒక్క సంస్థకూ ఇప్పటివరకు పూర్తిస్థాయి అనుమతులు లభించలేదు. భద్రతా కారణాలను పక్కనబెట్టి వ్యాపార ప్రయోజనాల కోసమే అంబానీ వర్గాలు సాకులు వెతుకుతున్నాయని మస్క్ బహిరంగంగా బట్టబయలు చేస్తున్నారు. ఏది ఏమైనా, భారత ఇంటర్నెట్ రంగంలో ఏకఛత్రాధిపత్యం చెలాయిస్తున్న రంగానికి పోటీగా స్టార్‌లింక్ రావడం అత్యంత అవసరం; ఎంతటి ఒత్తిళ్లు ఉన్నా మస్క్ పట్టు వీడకుండా భారత్‌లో స్టార్‌లింక్ సేవలు ప్రారంభిస్తేనే మన వినియోగదారులకు నిజమైన డిజిటల్ స్వేచ్ఛ, నాణ్యమైన సేవలు లభిస్తాయి.

తప్పు చేసినవారు చట్టం నుంచి తప్పించుకోలేరు

చట్టబద్ధమైన ఈడీ దర్యాప్తునకు రాజకీయ రంగులు పులమడం అజ్ఞానమేనని హితవు పలికారు. అపారమైన డబ్బు ఉంటే చాలు ఎలాంటి కేసులైనా మాఫీ అయిపోతాయా లేక విచారణను కాలయాపన చేయవచ్చా అని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కోర్టుకు వ్యక్తిగత హాజరుపై నిర్ణయం తీసుకోవాల్సింది న్యాయస్థానాలే తప్ప అందులో ప్రభుత్వ ప్రమేయం ఏమీ ఉండదని తేల్చి చెప్పారు. ఆర్థిక నేరాల కేసుల్లో విచారణను వేగవంతం చేసి ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలని, కాస్త ఆలస్యమైనా నరే తప్పు చేసినవారు చట్టం నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పిటిషన్ల పేరుతో విచారణను కాలయాపన చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను మేనేజ్ చేయవచ్చనుకోవడం జగన్ భ్రమ మాత్రమే. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ అక్రమాస్తుల కేసులను సీబీఐ, ఈడీ కోర్టులు రోజువారీ విచారణ జరిపి, తప్పు రుజువైతే ఎంతటి వారికైనా కఠిన శిక్ష పడేలా చట్టపరమైన ముగింపు పలకడమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష!

చెన్నై మెట్రోలో ప్రధాని మోదీ, సీఎం విజయ్ హైకోలాహల ప్రయాణం

రూ. 13 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం!



చెన్నై, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులో పర్యటిస్తున్న తరుణంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్ట్ రెండో దశలో భాగంగా రూ. 4,900 కోట్లతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పూనమల్లి-వడపళని కారిడార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుక అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి పోరూరు నుంచి పూందమల్లి స్టేషన్ వరకు ప్రధాని మోదీ ప్రత్యేకంగా మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ ప్రయాణంలో ఇరువురు నేతలు పరస్పరం పలు అభివృద్ధి అంశాలపై చర్చించుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పర్యటనలో భాగంగా తమిళనాడు వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా విలువైన పలు భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడంతో పాటు, ఇప్పటికే పూర్తయిన వివిధ ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అభివృద్ధి బాటలో కలిసి నడవాలని ప్రజలు కోరుకుంటున్న తరుణంలో, ఈ ప్రయాణం ఇరువర్గాల మధ్య కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపింది; ఏదేమైనా, కేంద్ర పెద్దలు రాష్ట్ర నాయకులతో కలిసి ఇలా ముందుకు సాగడం తమిళనాట రాబోయే కాలంలో సానుకూల పరిణామాలకు నాంది పలకడం ఖాయం.

నేడు భూమిని తాకనున్న శక్తివంతమైన సౌర తుఫాను

నెట్‌వర్క్, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రభావం!



అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : సూర్యుడిలో సంభవించిన రెండు భారీ విస్ఫోటనాల కారణంగా ఆదివారం భూమిని అత్యంత శక్తివంతమైన సౌర తుఫాను తాకనుండటంతో శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భూమి కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలు, రేడియో కమ్యూనికేషన్లు, జీపీఎస్ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. సూర్యుడిలోని కరోనల్ మాస్ ఎజెక్షన్ నుంచి భారీగా రేణువులు, అయస్కాంత పదార్థాలు వెలువడి భూమిని తాకినప్పుడు ఇక్కడి అయస్కాంత క్షేత్రం తీవ్ర గందరగోళానికి గురై భూఅయస్కాంత తుఫాను తలెత్తుతుంది. ఈ నెల 7, 8 తేదీల్లో రెండు సౌర జ్వాలలు భూమికి నుంచి భూమి వైపు దూసుకొచ్చాయని, వీటిలో రెండోది అత్యంత వేగంగా సాగుతూ మొదటి దాంతో విలీనమై ఆదివారం నాటికి భూమిని ఢీకొట్టవచ్చని అమెరికా వాతావరణ సంస్థ (నోవా) హెచ్చరించింది. దీనివల్ల 'జి-2' మోస్తరు స్థాయి భూఅయస్కాంత తుఫాను ఏర్పడి ఎగువ అక్షాంశ ప్రాంతాల్లో విద్యుత్ గ్రిడ్లలో హెచ్చుతగ్గులు ఉత్పన్నమయ్యే ప్రమాదముంది. ఈ తాజా సౌర తుఫాను తీవ్రతకు అనుగుణంగా శాటిలైట్ సంస్థలు తమ ఉపగ్రహాల ఆర్బిట్లను వెంటనే సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల రేడియో సంకేతాలు బలహీనపడటంతో పాటు విమానయాన, నౌకాయాన రంగాల్లో వాడే జీపీఎస్ సేవల కచ్చితత్వంలో లోపాలు రావచ్చు. మరోవైపు సూర్యుడి నుంచి వచ్చే ఆవేశిత రేణువులు భూవాతావరణంలోని వాయువులతో చర్య జరిపినప్పుడు ఆకాశంలో రంగురంగుల అరోరాలు ఏర్పడతాయని, ఇవి ధ్రువ ప్రాంతాలతో పాటు ఇతర ప్రదేశాలకూ విస్తరించే వీలుందని నివుణులు చెబుతున్నారు. అయితే భారత్‌లో విద్యుత్ సరఫరాలో భారీగా అవరోధాలు కలగడం లేదా అరోరాలు కనిపించడం వంటివి జరిగే అవకాశం తక్కువేనని భావిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ, అంతరిక్షంలో తలెత్తే ఇలాంటి ప్రకృతి విపత్తుల ముందు మానవ నమూనాలు ఎప్పుడూ బలహీనమే. ఉపగ్రహ సమాచార వ్యవస్థలు, పవర్ గ్రిడ్లు దెబ్బతినకుండా గ్లోబల్ అంతరిక్ష పరిశోధనా సంస్థలు తక్షణము అప్రమత్తమై ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత అత్యవసరం!

యూనిసెఫ్ గ్లోబల్ రాయబారిగా స్మృతి మంధాన.. బాలికల సాధికారతకు వజ్రాయుధం!



అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్‌గా మైదానంలో పరుగుల వరద పారిస్తున్న స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బక్కరాజ్యసమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధి (యూనిసెఫ్) ఇండియాకు ప్రచారకర్తగా, 'సెలబ్రిటీ అడ్వకేట్'గా ఆమె ఎంపికయ్యారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా యూనిసెఫ్ అధికారికంగా ఈ నియామకాన్ని ప్రకటించింది. దేశంలో బాలికల హక్కులు, వారి ఆరోగ్యం, విద్యా అవకాశాలు, క్రీడల్లో సమాన ప్రాతినిధ్యం మరియు సంక్షేమం కోసం స్మృతి మంధాన ఇకపై యూనిసెఫ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పని చేయనున్నారు. మైదానంలో తన ఆటలీరుతో కోట్లాది మంది యువతుకు ఆదర్శంగా నిలిచిన స్మృతి, ఈ సరికొత్త బాధ్యతతో సమాజంలో మార్పునకు బాటలు వేయనున్నారు. యూనిసెఫ్ ఇండియాలో భాగస్వామి కావడంపై స్మృతి మంధాన తీవ్ర ఆనందం, గర్వం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో అడుగుపెట్టి పెరిగిన దానినే గుర్తుచేసుకుంటూ, సమాజంలో ప్రతీ చిన్న కల నెరవేరాలన్నా ఒక సరైన అవకాశం దక్కడం నుంచే మొదలవుతుందని ఆమె చెప్పారు. కఠోర శ్రమ, పట్టుదల, కుటుంబం మరియు సమాజం నుంచి లభించే ప్రోత్సాహం తోడైతే, ఏ ఒక్క చిన్న అవకాశమైనా అసాధారణమైన విజయంగా మారుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి బాలికా పెద్ద పెద్ద కలలు కనేలా, తమ పూర్తి సామర్థ్యాన్ని నిరూపించుకునేలా వారికి సమాన అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. కేవలం బ్యాట్‌తోనే కాకుండా, సామాజిక బాధ్యతలోనూ ముందంజలో నిలుస్తున్న స్మృతి మంధాన లాంటి క్రీడా నక్షత్రం యూనిసెఫ్ ప్రతినిధిగా మారడం భారతీయ బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తుందనడంలో సందేహం లేదు; దేశంలో ఇంకా కొనసాగుతున్న లింగ వివక్షను తుదిపెట్టి, ఆడపిల్లలకు అన్ని రంగాల్లోనూ సమాన హక్కులను తెచ్చిపెట్టడంలో ఈ నిర్ణయం ఖచ్చితంగా ఒక మైలురాయిగా నిలుస్తుంది.

రియాద్ విమానాశ్రయంపై భయానక క్షిపణి దాడులు

తీవ్రంగా ఖండించిన భారత్!



అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన విధ్వంసకర క్షిపణి దాడులను భారత్ తీవ్రస్థాయిలో ఖండించింది. పౌర మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాల లాంటి రద్దీ ప్రాంతాలపై ఇటువంటి దురదృష్టకర దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ముఖ్యంగా అక్టోబర్ 10న జరిగిన దారుణమైన దాడిని ప్రస్తావిస్తూ, ఇలాంటి హింసాత్మక చర్యలు తక్షణమే ఆగాలని విదేశాంగ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ భయానక దాడుల కారణంగా తీవ్ర ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించగా ఎందరో పౌరులు తీవ్రంగా గాయపడ్డారని, సౌదీలో వేలసంఖ్యలో అమాయక పౌరుల ప్రాణాలు తీయడం హేయమైన ఉగ్ర చర్య ప్రపంచ శాంతికి ముప్పుగా మారిన ఇటువంటి దాడులను ఖండించడంలో సరిపెట్టకుండా, అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకుని గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలకు కారణమవుతున్న సాయుధ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది!

బంగ్లాదేశీయులు, ఫలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సుడాన్ దేశస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటన వెనుక హూతీ తిరుగుబాటుదారుల ప్రమేయం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దాడుల ధాటికి విమానాశ్రయంలోని పలు ప్రయాణీకుల విమానాలు పూర్తిగా ధ్వంసమవ్వడంతో రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం కూడా సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే ఈ తాజా దాడికి సంబంధించి హూతీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు, హూతీ తిరుగుబాటుదారులపై ప్రతిదాడి చర్యల్లో తాము కూడా పాల్గొన్నే అవకాశముందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించినప్పటికీ, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతర్జాతీయ పౌర విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని నిరపరాధుల ప్రాణాలు తీయడం హేయమైన ఉగ్ర చర్య ప్రపంచ శాంతికి ముప్పుగా మారిన ఇటువంటి దాడులను ఖండించడంతో సరిపెట్టకుండా, అంతర్జాతీయ సమాజం వెంటనే జోక్యం చేసుకుని గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలకు కారణమవుతున్న సాయుధ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది! నలుగురు సౌదీ పౌరులతో పాటు ఇద్దరు

మూకస్వామ్యంపై ప్రజాస్వామ్యం గెలిచింది

కాంగ్రెస్ అల్లర్ల కుట్రలను తిప్పికొట్టిన కేంద్రం!

అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. రాహుల్‌ను చారిత్రక ద్రోహి 'మీర్ జాఫర్'తో పోలుస్తూ, విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశంలో అలజడులు, ఆరాచకత్వం సృష్టించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఢిల్లీని నిర్బంధించి రచ్చ చేయాలనే లక్ష్యంతో ప్రతిపక్షాలు శనివారం తలపెట్టిన నిరసన ప్రదర్శనలు పూర్తిగా ఫ్లాప్ అయ్యాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఎద్దేవా చేశారు. కొన్ని టీవీలు, సోషల్ మీడియా చానెళ్లలో చూపిస్తున్నది అబద్ధమని, దేశం ప్రశాంతంగా ఉందని స్పష్టం చేశారు. వరుస ఎన్నికల్లో ఘోర ఓటములను తట్టుకోలేకే కాంగ్రెస్, ఆప్ నేతలు వీధి పోరాటాల పేరిట దేశాన్ని రణరంగంగా మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారని సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. సీఏఏ వ్యతిరేక ఆందోళనల వేళ విదేశాల నుంచి భారీగా నిధులు అందాయని, ఈ కుట్ర వెనుక అమెరికా ఉపాధ్యక్షుడితో పాటు ఆ దేశానికి చెందిన ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రమేయం ఉందని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు యత్నిస్తున్న రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌ల వైఖరిపై బీజేపీ అధ్యక్షుడు నితిన్ నవీన్ మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పటికీ, ఇంకా వీధి పోరాటాలు, ఆందోళనల పేరుతో దేశ రాజధానిని దిగ్బంధించి అరాచకం సృష్టించాలని చూడటం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కుకు ఒక పరిమితి ఉంటుంది; విదేశీ శక్తుల మద్దతుతో దేశ సార్వభౌమాధికారానికే సవాలు విసిరేలా ప్రవర్తించే అరాచక మూకలపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే!

ఎడిటర్ వాయిస్

అందరి కంటే ముందే పవన్ మొదలెట్టేశారు!

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా విడుదల కాలేదు. నేడో రేపో అని అంటున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఇంకా పూర్వ రంగం సిద్ధం చేసుకునే పనిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారాన్ని అందరి కంటే ముందే మొదలెట్టేశారు. ఆయన రంపచోడవరం నియోజకవర్గం కకవాడ గ్రామ సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రస్తావన చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని ప్రజలకు నేరుగా కోరడం ద్వారా ప్రచారాన్ని ప్రారంభించారు.

ప్రజలు అండగా : స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని అందువల్ల కూటమి అభ్యర్థులకు అండగా ప్రజలు నిలవాలని పవన్ కోరారు. అంతే కాదు కూటమిలోని అన్ని పార్టీల నాయకులు పరస్పరం కో ఆర్డినేట్ చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. కూటమి విజయం అందరి లక్ష్యం కావాలని కోరారు. ఇక జనసేన పాత్రుల గురించి ఆయన ప్రస్తావించారు. కూటమి గెలుపు కోసం 2024 లో జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారు అని ఆయన గుర్తు చేశారు. ఈసారి అలాంటి వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు దక్కాల్సిన అవసరాన్ని పవన్ నొక్కి చెప్పడం విశేషం.

రాజకీయాలకు అతీతంగా : తమ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వైసీపీ నేతలు ప్రాతినిధ్యం వహించిన చోట కూడా పంచాయతీ రాజ్ నిధులను అందించామని పవన్ గుర్తు చేశారు. అంతిమంగా ప్రజలకు మేలు జరగాలి అన్నదే కూటమి ప్రభుత్వం విధానం అని పవన్ స్పష్టం చేశారు. అదే సమయంలో ఏ పార్టీకి ఓటు చేశారని చూడకుండా అరకు పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని అన్నారు. అరకు ఎంపీగా వైసీపీని గెలిపించారని ఆయన చెప్పుకొచ్చారు. అయినా అభివృద్ధి ఆగదని పవన్ చెప్పడం వెనక జనం మద్దతు కూటమికి దక్కాలన్న ఆలోచన ఉందని అంటున్నారు.

పార్టీ రంగుల కోసం : వైసీపీ ప్రభుత్వం వందల కోట్లు పార్టీ రంగులను భవనాలకు వేయడానికి ఖర్చు పెట్టిందని పవన్ విమర్శించారు. ఆ నిధులు కనుక సక్రమంగా వెచ్చించి ఉంటే ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు వచ్చి ఉండేవని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు ఆ విధంగా మెరుగు పడేది అని పవన్ చెప్పారు. కానీ వైసీపీ తీరు వేరుగా ఉండడం వల్ల పల్లెలు గిరిజన ప్రాంతాలు ఎంతగానో నష్టపోయాయని పవన్ నిందించారు. తమకు రాజకీయాల కంటే వ్యవస్థ బాగుండాలి గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమని ఆయన చెప్పారు. ప్రజలు కూడా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రోడ్ల నాణ్యతను వారు పరిశీలించి సక్రమంగా వేస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేయాలని పవన్ కోరారు.

గిరిజనంతో మమేకం : మొత్తం మీద చూస్తే పవన్ గిరిజనంతో మమేకం అయ్యారు. ఆయన ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఎక్కువగా గిరిజన ప్రాంతాల మీదనే ఫోకస్ పెడుతున్నారు. తనకు గిరిజనులు అంటే ఇష్టమని తాజా సభలో పవన్ చెప్పడం విశేషం. గిరిజనం కోసం వారి అభ్యున్నతి కోసం తాను పనిచేస్తాను అని పవన్ అన్నారు. మొత్తానికి పవన్ చూపిస్తున్న ఈ నిబద్ధత గిరిజన ప్రాంతాలలో రాజకీయ పరిణామాలను కూడా మారుస్తుందా అన్న చర్చ సాగుతోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

క్రైమ్ వాయిస్

మిర్యాలగూడలో భయానక అగ్నిప్రమాదం

భవనంలో చిక్కుకున్న కుటుంబాన్ని కాపాడిన ఫైర్ సిబ్బంది!



మిర్యాలగూడ, విశ్వం వాయిస్ న్యూస్ : నల్లొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఒక బహుళ అంతస్తుల భవనంలో ఆదివారం ఆకస్మికంగా భారీ అగ్నిప్రమాదం సంభవించి తీవ్ర భయాందోళన రేకెత్తించింది. భవనం కింద ఉన్న చెప్పుల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో క్షణాల్లోనే భవనమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో పై అంతస్తులో నివాసముంటున్న ఒక కుటుంబం బయటకు రాలేక, ఊపిరాడక నిరసనగా భవనంలోని రెండో అంతస్తులోనే చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని, సమయస్ఫూర్తితో నిచ్చెనల సాయంతో కిటికీల ద్వారా పైకి ఎక్కి భయాందోళనలో ఉన్న కుటుంబ సభ్యులందరినీ సురక్షితంగా కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ తర్వాత సిబ్బంది క్రమించి మంటలను ఆర్పేసి అదుపులోకి తీసుకొచ్చారు. సిబ్బంది సమయస్ఫూర్తితో ప్రాణనష్టం తప్పినప్పటికీ, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు ఉన్న భవనాల్లో కనీస అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి నగరాల్లోని భవనాల్లో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నిబంధనలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాల్సిందే!

పీజీ వైద్య విద్యార్థినిపై ఎంబీబీఎస్ విద్యార్థి లైంగిక దాడి

ఫొటోలు, వీడియోలు తీసి డబ్బుల కోసం బెదిరింపులు - పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి అరెస్ట

చేవెళ్ల, విశ్వం వాయిస్ న్యూస్ : పీజీ వైద్య విద్యార్థినిపై ఆమె కళాశాలలోనే చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థి లైంగిక దాడికి పాల్పడటంతోపాటు వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేశారు. అతని తీరుతో విసిగిపోయిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్టు చేశారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ కట్టా నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లలోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో పీజీ చదువుతున్న విద్యార్థినితో అదే కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన రాహుల్ విద్యాపరమైన విషయాలపై మాట్లాడే నెపంతో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ఓ సందర్భంలో ఆమెపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతోపాటు డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరించేవాడు. బాధితురాలికి ఇదివరకే మరో వ్యక్తితో వివాహం నిశ్చయమైన విషయం తెలుసుకున్న నిందితుడు.. ఆమెకు సంబంధించిన కొన్ని ఫొటోలను సదరు వ్యక్తికి పంపాడు. దీంతో విసిగిపోయిన బాధితురాలు కుటుంబీకుల సహకారంతో గురువారం రాత్రి తన స్వస్థలం ఖమ్మం జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఠాణాకు బదిలీ చేశారు. శనివారం నిందితుడిని పట్టుకున్న ఇక్కడి పోలీసులు న్యాయమూర్తి ముందు హాజరుపరిచి రిమాండుకు తరలించారు. అతడి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గంజాయి కేసులో విచారణకు వెళ్లిన..

పోలీసులపై మూకుమ్మడి దాడి

సీఐ, ఏఎస్ఐ సహా నలుగురికి గాయాలు
తమను కులం పేరుతో దూషించారని ఆదివాసీల ఆరోపణ



ఆదిలాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : గంజాయి కేసు విషయమై విచారణకు వెళ్లిన పోలీసులపై ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం వాయిపేట్ గ్రామస్థులు మూకుమ్మడిగా దాడి చేసిన ఉదంతం శనివారం వోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇన్చోడ గ్రామీణ సీఐ సీహెచ్ రమేశ్‌తో పాటు ఏఎస్ఐ బలిరాం నాయక్, హెడ్‌కానిస్టేబుల్ భీంరావు, మరో కానిస్టేబుల్ శివప్రసాద్ గాయపడ్డారు. వారిని ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. వాయిపేట్‌కు చెందిన చహకత రాము తన పెరట్లో సాగు చేస్తున్న 18 గంజాయి మొక్కలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు విషయమై తదుపరి విచారణ కోసం సీఐ, ఏఎస్ఐ, మరో నలుగురు కానిస్టేబుళ్లు శనివారం గ్రామానికి వెళ్లగా..స్థానికులు చుట్టుముట్టారు. గంజాయి సమాచారం ఎవరు ఇచ్చారో చెప్పాలని నిలదీస్తూ..అక్కడే ఉన్న ఆటవీ బీట్ ఆఫీసర్ సిబ్బందిపై చేయిచేసుకున్నారు. దీంతో పోలీసులు ఆత్మరక్షణార్థం. గ్రామస్థులు దాడి చేస్తారేమోనన్న అనుమానంతో.. కుంటగూడ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. రహదారి సరిగా లేకపోవటంతో ఆగిపోయారు. అనంతరం గ్రామస్థుల మహిళలతో కలిసి రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో పోలీసులు గాయపడ్డారు. పోలీసు వాహనం సహా వారి ఫోన్లు ధ్వంసమయ్యాయి. విచారణ సందర్భంగా పోలీసులు గ్రామస్థులను కులం పేరుతో దూషించారని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలోనే వివారం తెలిశిందన్నారు. ఈ విషయమై ఉట్నూరు ఏఎస్పీ రుత్విక్‌సాయి మాట్లాడుతూ, అదనపు బలగాల రాక కోసం పోలీసులు ఎదురుచూసే సమయంలో దాడి జరిగిందని, సీఐతో పాటు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఆదివాసీలను పోలీసులు దూషించారనే ఆరోపణలను ఖండించారు.

బస్సులో ప్రయాణిస్తూ.. గుండెపోటుతో యువకుడి మృతి



చౌటుప్పల్, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తుండగా గుండెపోటు రావడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆదివారం వోటుచేసుకుంది. వల్లూరు జిల్లా రాదెంర్ల గ్రామానికి చెందిన గంగవరపు చైతన్య (33) ఐదేళ్ల క్రితం యూకే వెళ్లి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. రెండు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి అద్దె గదిలో ఉంటూ రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నత చదువులు కొనసాగిస్తున్నాడు. ఈ నెల 10న ఉదయం తన అన్న గంగవరపు అనిశాశ్‌కు ఫోన్ చేసి, ఛాతినొప్పితో బాధపడుతున్నానని, ఇంటికి వస్తానని తెలిపాడు. ఆదివారం ఉదయం 11:30కు ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో విలకలూరిపేటకు బయలుదేరాడు. బస్సు చౌటుప్పల్ పరిధిలోని లక్కారం బ్రిడ్జి వద్దకు చేరుకున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో బస్సు హెల్పర్‌కు తెలిపాడు. అతను అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా మధ్యాహ్నం సమయంలో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.





కాకినాడ జీజీహెచ్‌లో బరితెగింపు నిర్లక్ష్యం.. నిరుపేదల ప్రాణాలతో చెలగాటం!

ఒకటి కాదు.. రెండు వరుస ఘోరాలు..


పెద్దాసుపత్రిలో రోగులకు భరోసా శూన్యం

బాలింత శరీరంలో 4 అంగుళాల రాడ్, దూది పెట్టి కుట్లు..

15 రోజుల నరకయాతన తర్వాత రక్తస్రావంతో బయటపడ్డ నిర్వాకం!



- జగన్నాధపురానికి చెందిన అరదాడి లలితను సెప్టెంబర్ 23న జీజీహెచ్ గైనకాలజీ వార్డులో చేర్పించారు.
- సెప్టెంబర్ 26న మగబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం రక్తస్రావం అవడంతో సర్జికల్ ప్రొసీజర్ చేసిన వైద్యులు...
- లోపల దూది, సుమారు 4 అంగుళాల స్టీల్ రాడ్‌ను అలాగే వదిలేసి కుట్లు వేసేశారు.
- ఇంటికి వెళ్లిన తర్వాత 15 రోజుల పాటు తీవ్రమైన నొప్పి, దుర్వాసనతో బాధపడింది.
- బాత్‌రూంలో ఒత్తిడితో మోషన్ వెళ్తుండగా రాడ్ బయటకు వచ్చింది. రక్తస్రావంతో కుప్పకూలిపోయింది.
- ఫోటోలు తీసిందని ఫోన్లు లాక్కొని డిలీట్ చేయించారు. రికార్డులు దాచిపెట్టే ప్రయత్నం చేశారు.
- తర్వాత ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసి రాడ్‌ను బయటకు తీశారు.
- ప్రస్తుతం బాధితురాలు ఆరు వారాల బెడ్‌రెస్ట్‌లో, మళ్లీ రీ-ఆపరేషన్ భయం.


వైద్య రికార్డుల నుంచి (ఫైలు ఫోటోలు)

కాకినాడ (విశ్వం వాయిస్ బ్యూరో):

ఉభయ గోదావరి జిల్లాల నిరుపేదలకు సంజీవనిగా నిలవాల్సిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ప్రాణాలు కాపాడాల్సిన వైద్యుల చేతులే రోగుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ప్రసవం కోసం వచ్చిన ఓ అభాగ్యురాలి శరీరంలో సర్జికల్ రాడ్, దూది పెట్టి కుట్లు వేసి ఇంటికి పంపించిన అమానవీయ ఘటన మరవకముందే.. ప్రాణాంతక వ్యాధితో వచ్చిన మరో రోగిని కనీస పరీక్షలు లేకుండా నిర్లక్ష్యంగా వెనక్కి పంపిన వైనం వెలుగుచూసింది. ఈ వరుస ఘటనలు జీజీహెచ్‌లో పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. నిరుపేద రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్య సిబ్బందిపై, ఈ ఘోరాలను నిలువరించలేని పర్యవేక్షక అధికారులపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

ఘటన 1: బాలింత కడుపులో 4 అంగుళాల రాడ్, దూది.. మృత్యుముఖంలో లలిత!

కాకినాడ జగన్నాధపురానికి చెందిన అరదాడి లలిత అనే నిరుపేద మహిళను ప్రసవం నిమిత్తం సెప్టెంబర్ 23న జీజీహెచ్ గైనకాలజీ వార్డులో చేర్పించారు. సెప్టెంబర్ 26న ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం రక్తస్రావం ఎక్కువగా అవుతుండటంతో సర్జికల్ ప్రొసీజర్ చేసిన వైద్యులు.. లోపల దూది (కాటన్), సుమారు 4 అంగుళాల పొడవైన స్టీల్ రాడ్/ట్యూబ్‌ను అలాగే వదిలేసి నిర్లక్ష్యంగా కుట్లు వేసేశారు. అనంతరం నాలుగు రోజులకే ఆమెను డిశ్చార్జ్ చేసి చేతులు దులుపుకున్నారు.

15 రోజుల పాటు నరకయాతన: ఇంటికి వెళ్లినప్పటి నుంచి బాధితురాలు తీవ్ర కడుపునొప్పి, భరించలేని దుర్వాసనతో అల్లాడిపోయింది. ఏకంగా 15 రోజుల పాటు మోషన్ కాక తీవ్ర అస్వస్థతకు గురైంది. జగన్నాథపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, కుట్లలో దూది ఉండిపోయిందని గుర్తించిన వైద్యులు దాన్ని తొలగించి మందులిచ్చారు.

బాత్‌రూమ్‌లోనే కుప్పకూలిన వైనం: అక్టోబర్ 10న తెల్లవారుజామున తీవ్ర ఒత్తిడితో మోషన్‌కు వెళ్లిన సమయంలో లోపల ఉన్న 4 అంగుళాల స్టీల్ రాడ్ ఒక్కసారిగా బయటకు వచ్చింది. ధారగా రక్తం కారిపోవడంతో లలిత బాత్‌రూమ్‌లోనే స్పృహతప్పి పడిపోయింది.

సాక్ష్యాలు చెరిపేసేందుకు దౌర్జన్యం: రక్తపు మడుగులో ఉన్న లలితను కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తీసుకురాగా, వైద్యులు దాన్ని కప్పిపుచ్చేందుకు 'స్ప్రింగ్' అంటూ తప్పుడు మాటలు చెప్పారు. ఆధారాల కోసం బంధువులు ఫోటోలు తీయగా, అక్కడి సిబ్బంది ఫోన్లు లాక్కుని ఫోటోలు బలవంతంగా డిలీట్ చేయించారు. పాత డిశ్చార్జ్ రికార్డులను దాచిపెట్టే ప్రయత్నం చేశారు.

ఆరు వారాల బెడ్‌రెస్ట్.. రీ-ఆపరేషన్ భయం: కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్‌ను ఆశ్రయించి నిలదీయడంతో దిగివచ్చిన వైద్యులు ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసి రాడ్‌ను బయటకు తీశారు. అయితే, ప్రస్తుతం బాధితురాలి శరీరానికి సైడ్ ట్యూబ్ వేశారని, కనీసం ఆరు వారాల పాటు బెడ్‌పైనే ఉండాలని, మళ్లీ రీ-ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు తేల్చిచెప్పారు. తల్లి లేని అభాగ్యురాలు, నిరుపేద కూలీ కుటుంబానికి చెందిన లలిత పరిస్థితి ఇప్పుడు అత్యంత విషమంగా మారింది.

ఘటన 2: సికిల్ సెల్ గుర్తించకుండా డిశ్చార్జ్.. ప్రాణాల మీదకు తెచ్చిన ఎమర్జెన్సీ వైద్యం!

జీజీహెచ్ క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ) విభాగంలో ప్రాథమిక పరీక్షలు కూడా సక్రమంగా జరగడం లేదనడానికి గొల్లప్రోలుకు చెందిన రోగి ఘటనే ప్రత్యక్ష సాక్ష్యం. తీవ్ర అస్వస్థత, నొప్పితో గొల్లప్రోలు నుంచి ఎమర్జెన్సీ వార్డుకు వచ్చిన రోగికి డ్యూటీ వైద్యులు కనీస రక్తపరీక్షలు కూడా చేయకుండా, పెయిన్‌కిల్లర్ ఇంజెక్షన్లతో సరిపెట్టి నిర్లక్ష్యంగా డిశ్చార్జ్ చేసేశారు.

మళ్లీ వస్తేనే అసలు నిజం వెలుగులోకి: ఇంటికి వెళ్లిన తర్వాత నొప్పి భరించలేక రోగి ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు మళ్లీ జీజీహెచ్‌కు తీసుకొచ్చి గట్టిగా పట్టుబట్టారు. అప్పుడు నిర్వహించిన పరీక్షల్లో రోగి తీవ్రమైన, ప్రాణాంతకమైన 'సికిల్ సెల్' వ్యాధితో బాధపడుతున్నట్లు తేలింది.

13 రోజులు ఐసీయూలో చికిత్స: ప్రాథమిక దశలోనే గుర్తించాల్సిన వ్యాధిని గాలికొదిలేయడం వల్ల రోగి పరిస్థితి విషమించి ఏకంగా 13 రోజుల పాటు ఐసీయూలో అత్యవసర చికిత్స అందించాల్సి వచ్చింది. సరైన సమయంలో కుటుంబ సభ్యులు తిరిగి తీసుకురాకపోతే ఆ రోగి ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి.

పర్యవేక్షక వ్యవస్థల నిద్రమత్తు.. సూటి ప్రశ్నలు!

ఆసుపత్రి పాలనను చక్కదిద్దేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వంటి కీలక అధికారులు ఉన్నప్పటికీ జీజీహెచ్‌లో ఈ అరాచకాలు ఎందుకు జరుగుతున్నాయి?

సీనియర్ వైద్యులు ఎక్కడ?: క్లిష్టమైన డెలివరీలు, సర్జరీలు జరుగుతున్నప్పుడు సీనియర్ ప్రొఫెసర్లు వార్డుల్లో ఉంటున్నారా? రోగుల ప్రాణాలను ట్రైనీలు, పీజీలకే వదిలేస్తున్నారా?

రికార్డులు మాయం చేసే అధికారమెవరిచ్చారు?: బాధితురాలు ప్రాణాపాయ స్థితిలో వస్తే ఫోన్లు లాక్కోవడం, ఫోటోలు డిలీట్ చేయించడం, డిశ్చార్జ్ బుక్కులు దాచడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయి?

క్యాజువాలిటీలో నిర్లక్ష్యపు డాక్టర్లపై చర్యలేవి?: సరైన రోగనిర్ధారణ చేయకుండా రోగులను ఇళ్లకు పంపేస్తున్న ఎమర్జెన్సీ వైద్యులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

డిప్యూటీ కలెక్టర్ బాధ్యత ఏంటి?: ఆసుపత్రి రోజువారీ పరిపాలన, రోగుల సౌకర్యాలు, వైద్యుల హాజరును పర్యవేక్షించాల్సిన అధికారి క్షేత్రస్థాయిలో ఎందుకు తనిఖీలు చేపట్టడం లేదు?

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కలెక్టర్ తక్షణమే స్పందించాలి!

కాకినాడ కేంద్రంగా ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పెద్దాసుపత్రిలో చోటుచేసుకున్న ఈ వరుస నిర్లక్ష్యాలపై స్వతంత్ర వైద్య నిపుణులతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ప్రజలు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

కఠిన చర్యలు చేపట్టాలి: లలిత శరీరంలో రాడ్ వదిలేసిన వైద్య బృందంపై, గొల్లప్రోలు రోగి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. లలిత కుటుంబానికి పరిహారం: ఆరు వారాల పాటు ఆసుపత్రికే పరిమితమై, రీ-ఆపరేషన్ ఎదుర్కొంటున్న నిరుపేద లలితకు అత్యుత్తమ వైద్యం ఉచితంగా అందించడంతో పాటు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించాలి.

ఆసుపత్రిపై ప్రత్యేక నిఘా: స్థానిక సమస్యలపై నిరంతరం గళమెత్తే ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్, అలాగే జిల్లా కలెక్టర్ తక్షణమే జీజీహెచ్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పెద్దాసుపత్రి వ్యవస్థలను ప్రక్షాళన చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రజల డిమాండ్: సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది?

రోగి శరీరంలో పరికరాలు మరిచిపోయి కుట్లు వేయడం ముమ్మాటికీ నేరపూరిత నిర్లక్ష్యమే. దీనికి బాధ్యులైన వైద్యులను ఎందుకు సస్పెండ్ చేయలేదు?

ఆసుపత్రికి వస్తున్న నిరుపేద రోగులకు న్యాయం జరగాలంటే ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, సూపరింటెండెంట్ తమ నివేదికలను బహిర్గతం చేయాలి.

జిల్లా అధికార యంత్రాంగం ఇకనైనా మేల్కొని ఈ ఘటనలపై అధికారిక ప్రకటన చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

దుర్గమ్మ సన్నిధిలో మీడియాకు నో ఎంట్రీ!

ఇన్‌ఫ్లుయెన్సర్లకు పెద్దపీట.. జర్నలిస్టులకు అడ్డంకులా? - ప్రజలకు సమాచారం చేరవేసే మీడియాపై ఈ వివక్ష ఎందుకు?



విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మీడియాకు ఎదురవుతున్న ఆంక్షలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఉత్సవాల విశేషాలు, అధికారుల ఏర్పాట్లు, భక్తుల సమస్యలను ప్రపంచానికి తెలియజేయాల్సిన మీడియాకు అవకాశం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా? మరోవైపు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండటంతో అధికారుల తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మీడియా లేకపోతే ప్రపంచానికి సమాచారం ఎలా చేరుతుంది?

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకం. ప్రభుత్వ కార్యక్రమాల నుంచి ప్రజా సమస్యల వరకు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రమాదాల వరకు, దేవాలయ ఉత్సవాల నుంచి భక్తులకు ఎదురయ్యే ఇబ్బందుల వరకు ప్రజలకు సమాచారాన్ని చేరవేసేది మీడియానే. అధికారుల పనితీరును ప్రజల ముందుంచేది, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేది కూడా మీడియానే. ఒకవేళ మీడియానే లేకపోతే.. ప్రజలకు వాస్తవాలు ఎలా తెలుస్తాయి? అధికారుల ఏర్పాట్లలో లోపాలుంటే ఎవరు ప్రశ్నిస్తారు? భక్తులకు ఇబ్బందులు ఎదురైతే వాటిని ఎవరు వెలుగులోకి తీసుకొస్తారు? సామాన్యుల గొంతుకను ఎవరు వినిపిస్తారు? అనే ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి.

ఇన్‌ఫ్లుయెన్సర్లకు స్వాగతం.. జర్నలిస్టులకు ఆంక్షలా?

సోషల్ మీడియా ప్రాధాన్యతను ఎవరూ కాదనలేరు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అయితే, అదే సమయంలో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే జర్నలిస్టులకు తగిన గుర్తింపు, వార్తా సేకరణకు అవసరమైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? భద్రత, రద్దీ నియంత్రణ పేరుతో ఆంక్షలు విధిస్తే.. అవి అందరికీ వర్తించేలా పారదర్శకంగా ఉండాలి. ఒక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చి, మరో వర్గాన్ని పక్కనపెడుతున్నారనే భావన కలగకుండా అధికారులు వ్యవహరించాలి.

అమ్మవారి ఉత్సవాలు ప్రజల పండుగ.. ప్రచారానికి మాత్రమే పరిమితం కాకూడదు!

ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. ఈ ఉత్సవాల్లో భక్తుల సౌకర్యాలు, దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల పరిస్థితి, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి అంశాలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. అందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించి, మీడియా ప్రతినిధులకు సముచిత అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. మీడియా అనేది కేవలం కెమెరా ముందు కనిపించే వ్యక్తి కాదు.. ప్రజలకు, పాలకులకు మధ్య వారధి. వార్తను చూపించే తెర వెనుక ప్రజల పక్షాన నిలబడే బాధ్యత ఉంటుంది.







ఫిర్యాదు పరిష్కారమే కాదు.. ప్రజల సంతృప్తి ముఖ్యం

పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లు
నేడు జిల్లావ్యాప్తంగా యథావిధిగా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్



అమలాపురం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఆ పరిష్కారంపై వారు ఎంతవరకు సంతృప్తి చెందుతున్నారో తెలుసుకోవడం కూడా పాలనలో కీలకమని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిస్తున్న సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు జిల్లాలోని అన్ని పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజల నుంచి అందే అభిప్రాయాలు, సూచనల ఆధారంగా ప్రభుత్వ సేవల్లోని లోపాలను గుర్తించి, అవసరమైన మార్పులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. అర్జీ స్వీకరణ నుంచి సమస్య పరిష్కారం వరకు అధికారులు స్పందిస్తున్న తీరు, సేవల అందుబాటు, పరిష్కార ప్రక్రియపై ప్రజల సంతృప్తి వంటి అంశాలను తెలుసుకోవడం ద్వారా పాలనను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించవచ్చని పేర్కొన్నారు.అక్టోబర్ 12వ తేదీ సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా పర్యవేక్షణ చేపడతామని తెలిపారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు నమోదు చేయాలి

పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సేవలు పొందిన ప్రజలు అక్కడ ఏర్పాటు చేసిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ కోరారు. అధికారుల స్పందన, సేవల నాణ్యత, సమస్యల పరిష్కార విధానం తదితర అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని తెలిపారు.

ప్రజల నుంచి అందే అభిప్రాయాలను కేవలం సమాచారంగా కాకుండా, పాలనా వ్యవస్థ పనితీరును మెరుగుపరిచే విలువైన సూచనలుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాల ఆధారంగా లోపాలను గుర్తించి సరిదిద్దడంతో పాటు, సేవలను మరింత సులభతరం చేసి మెరుగైన పరిపాలన అందించేందుకు చర్యలు చేపడతామని వివరించారు.

ఇంటి నుంచే ఫిర్యాదు.. వాట్సాప్ ద్వారా పౌర సేవలు

పీజీఆర్ఎస్ కేంద్రాలకు ప్రత్యక్షంగా రాలేని ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్, 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా, 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలను పొందవచ్చని తెలిపారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రజల అభిప్రాయాలకు పాలనలో తగిన ప్రాధాన్యం కల్పించడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.ఫిర్యాదుల పరిష్కారంతో పాటు ప్రజల సంతృప్తి, సేవల నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

మెగాస్టార్ చిరంజీవిని కలిసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమండ్రి విమానాశ్రయానికి విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానంద రావు యోగ క్షేమాలను చిరంజీవి అడిగి తెలుసుకున్నారు. గతం నుండి వారి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సత్యానందరావుతో పాటు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, ఆకుల రామకృష్ణ ఉన్నారు.

టిల్ ఫ్లాక్‌లో ఘనంగా కృతజ్ఞతార్పణ పండుగ



రావులపాలెం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయంలో ఆదివారం సంఘ సభ్యులు భక్తి శ్రద్ధలతో కృతజ్ఞత అర్పణల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చ్ పైరెస్ కప్పల డామియన్ ఇశ్రాయేల్ సమీర అధ్వర్యంలో జరిగిన కోత పండుగలో ముఖ్యఅతిథిలుగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, తెలుగు యువత అధ్యక్షులు సతీష్ రాజు డా.ఓ.రామకృష్ణ అనిత,ఎంపిడిఓ జి. రాజేంద్రప్రసాద్,డా.వీరబ్బాయి తదితరులు పాల్గొని సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ప్రారంభించారు. ఈ సంధర్భంగా రెవ.,డామియన్ ఇశ్రాయేల్ మాట్లాడుతూ యెహోవా ధర్మశాస్త్ర ప్రకారం ప్రజలు వారు పండించిన పంటలో ప్రధమ ఫలాలను ఎంతో భక్తి శ్రద్ధలతో దేవాలయానికి తీసుకొనివచ్చి దేవునికి సమర్పించడం ద్వారా దేవుని ఆశీర్వాదాలు వారి పంటలపై ఉంటాయన్నారు. అదే విధంగా ప్రపంచ పాస్టర్స్ డే సందర్భంగా సంఘ సభ్యులు రెవ. డామియన్ ఇశ్రాయేల్ సమీరా దంపతులకు సంఘ సభ్యులు అభినందలు తెలియజేసారు.అనంతరం డి.ఎస్.సి యూత్ నిర్వహించిన లక్కీ డ్రా బహుమతులు గెలుచుకున్న వారికి సంఘ పెద్దలచే అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు,స్త్రీల సమాజం సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

అంగరంగ వైభవంగా శరన్నవరాత్రుల ప్రారంభం



రావులపాలెం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : రావులపాలెం మండలంలో ప్రతి గ్రామంలోనూ ప్రతి వీధిలోను శరన్నవరాత్రి మండపాలు రంగురంగులవిద్యుత్ దీపఅలంకరణలతో పూల మండపాలతో సాంప్రదాయ మామిడి తోరణాలు కట్టి అమ్మవారి విగ్రహాలు పెట్టి దేవీ నవరాత్రులు మొదలైనవి .మొదటి రోజు అయిన ఆదివారం అమ్మవారు బాల్యం దైవత్వంతో సమానమని నిరూపిస్తారు. ఈ బాల రూపం తర్వాతనే వేరు వేరు కథలు వేరు వేరు రూపాలు అన్నీ వస్తాయి. సంతానం లేని వారికి సంతాన సౌభాగ్యం లభిస్తుంది. అందరిలోను దైవాన్ని చూసే భారతీయ సంప్రదాయంలో స్త్రీ శిశువులలో దైవత్వాన్ని ఆపాదించి పూజించే సంప్రదాయం ఈ నవరాత్రుల ప్రారంభం రోజులో మనకు కన్పిస్తుంది. అతి తీవ్రమైన శక్తిని ఒకేసారి ఉపాసించడం కాకుండా క్రమానుగతికంగా చిన్న శక్తినుంచి పెద్ద శక్తివరకు కొలిచే ఈ నవరాత్రి ఉత్సవాలలో బాలాత్రిపురసుందరి ఆరాధనతో మొదలు అవుతుంది.

ఈతకోట శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న బీజేపీ నేతలు

శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు



రావులపాలెం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి పక్కన కొత్త సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని ఆదివారం నాడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జిల్లా పలువురు నాయకులు దర్శించుకున్నారు. దసరా, శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు.మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల పవన్ కుమార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి కారంకి శ్రీనివాస్, ఎన్ఏ మార్చా జిల్లా అధ్యక్షులు పోనుగుపాటి శ్రీనివాస్, సేవా సంకల్ప అభియాన్-ఆశీర్వాద్ దీపం జిల్లా కో-కన్వీనర్ గంద్రోతు వీరగోవిందరావు,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెన్మెత్స నరసింహారాజు.అయినవిల్లి మండల బీజేపీ అధ్యక్షులు యనమదల వెంకటరమణ, అంబాజీపేట మండల బీజేపీ అధ్యక్షులు కురసా ఆంజనేయులు తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జనపిరెడ్డి గోవిందరావు, కమిటీ సభ్యులు, అర్చకులు బీజేపీ నాయకులకు సాదర స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రుల వేళ శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు నాయకులు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం

కొమరాజులంకలో రూ.69 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



రావులపాలెం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం మండలం కొమరాజులంకలో రూ.36 లక్షల పంచాయతీరాజ్ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను ఆయన ప్రారంభించారు. గ్రామీణ వైద్య సేవలు మెరుగుదలకు హెల్త్ క్లినిక్ ల నిర్మాణం దోహదం చేస్తుందన్నారు. అనంతరం రూ.33 లక్షల పుష్కర నిధులతో నిర్మించనున్న రహదారికి భూమి పూజ నిర్వహించారు. 2027 పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

మంజేరు గ్రామంలో వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

ముఖ్య అతిథులుగా వాసంశెట్టి సత్యం, అక్కల రిశ్వంత్ రాయ్



కాజులూరు, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాజులూరు మండలం మంజేరు గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల తొలిరోజు సందర్భంగా శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ వైస్‌చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులకు గ్రామస్థులు, ఉత్సవ నిర్వాహకులు గరగ నృత్యాలు, మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మంజేరు గ్రామంలోని పాత మంజేరు, కొత్త మంజేరు ప్రాంతాల్లో ప్రతి ఏటా అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి ఉత్సవం నిర్వహించనుండగా, ఉదయం 11 గంటల నుంచి భక్తులకు భోజన ప్రసాదం (మహా అన్నదానం) ఏర్పాటు చేశారు.

ప్రతిరోజూ విశేష పూజలు

ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, స్వామివారి సేవలు, నాదస్వరం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచగవ్యాది కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 9 గంటలకు పంచామృతాలతో అభిషేకం, వివిధ సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం నాదస్వరం, స్వామివారి సేవలు, రాత్రి 9 గంటలకు శ్రీ చక్రనవరార్చన వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దడాల నాగార్జున, గండి మణికంఠ, పుణ్యమంతుల గోవిందు, చందాల మల్లిబాబు, పుణ్యమంతుల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ద్రాక్షారామంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ద్రాక్షారామ, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలోని శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి వరకు అక్టోబరు 11 నుంచి 23వ తేదీ వరకు ఈ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల 9 నిమిషాలకు వేగాయమ్మపేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకర్, దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అల్లు వెంకట దుర్గా భవాని, అర్చకుల ఆధ్వర్యంలో కలశ స్థాపన నిర్వహించి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం 4 గంటలకు స్వామివారి మేలుకొలుపు, సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 5 గంటలకు తీర్థపు బిందె, బాలభోగం, ప్రాతఃకాలార్చన నిర్వహించారు. ఉదయం 7 గంటలకు లక్ష కుంకుమార్చన చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి అమ్మవారికి శ్రీచక్ర నవార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుంచి శ్రీ మాణిక్యాంబ అమ్మవారికి సువర్ణ పుష్పార్చన, విశేష పుష్పార్చన నిర్వహించనున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తుండటంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానంలో భక్తి వాతావరణం నెలకొంది.

శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : దసరా నవరాత్రుల ప్రారంభం సందర్భంగా ఈరోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి రావులపాలెం ఆదిలక్ష్మి నగర్ వద్ద, అలాగే 80 పోర్షన్ బిల్డింగ్ వద్ద ప్రతిష్ఠించిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఊరేగింపుగా తీసుకువెళ్తున్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని చిర్ల జగ్గిరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఏవి నగరంలో శ్రీ కళ్యాణి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు
ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి యనమల దంపతులు





కోటనందూరు, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : కలియుగ ఆరాధ్య దైవం శ్రీ శ్రీదేవి భూదేవి సమేతుడై కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీనగరంలో కొలువైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దివ్య సన్నిధిలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమైయ్యాయి.ఆలయ అర్చకులు కలశ స్థాపన గావించి శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ గావించారు.ఇంతో బాలాత్రిపుర సుందరి అలంకరణలో దర్శనమించిన జగన్మాతను సీనియర్ నాయకులు యనమల నాగేశ్వరరావు రామలక్ష్మి దంపతులు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విజయలక్ష్మీ దంపతులు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య దర్శించుకుని విశేష పూజలు గావించారు. ఈ ఏడాది నవరాత్రుల్లో ఓ ప్రత్యేక ఉంది.ఈనెల 17 వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ యనమల దంపతులు శత చండీ యాత లక్ష్మీ యాగం చేయనున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే శత చండీ యాత లక్ష్మీ యాగం ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.శరన్నవరాత్రుల తొలి రోజున యనమల రాజేష్, యనమల పెదబాబు ,కొయ్యా శ్రీను,తమరాన వరలక్ష్మీ, కేబుల్ శ్రీను, చొక్కా అప్పారావు, కొయ్యా సూరిబాబు,కేశవ్,అంగుళూరి సుధాకర్,అరిగెల నర్సింహమూర్తి, పీర్ల వెంకట శివ, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా ప్రారంభమైన శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవములు

కాకరాపల్లి శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు
శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన దుర్గామాత





కోటనందూరు, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనముగా ప్రారంభమైనవి. మండల వ్యాప్తంగా కోటనందూరు, పి కొత్తూరు,కే ఇ చిన్నయ్యపాలెం, బొద్దవరం, అల్లిపూడి తదితర గ్రామాలలో ఈరోజు అమ్మవారిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. కాకరాపల్లి శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కమిటీ చైర్మన్ వాసం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవములు ప్రారంభించారు. తొలిరోజు సుమారు 1500 మంది స్త్రీలు కలశయాత్ర ద్వారా అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించిన అనంతరము ఆలయంలో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు అనంతరము భక్తులకు దర్శనం కల్పించగా వందలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ కాకరాపల్లి గ్రామంలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో 15వ దేవి శరన్నవరాత్రి మహోత్సవములు చేస్తున్నామని 9 రోజులు జరిగే ఈ శరన్నవరాత్రి మహోత్సవంలలో ప్రతిరోజు ఒక్కొక్క అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారని ఉదయం పంచామృతాభిషేకములు, కుంకుమ పూజ, అలంకరణ, హారతి అనంతరము భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారని ఈరోజు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారని తెలియజేశారు. సాయంత్రం హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు, భక్తులు దాతలు గ్రామ పెద్దలు తదితరులు సహాయ సహకారాలతో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనముగా నిర్వహించుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లంక ప్రసాద్ సామినీడి కృష్ణారెడ్డిన, డాక్టర్ వెలగ వెంకటకృష్ణారావు, అమలకంటి కొండలరావు, కోలా సత్యనారాయణ, వాసం ఏడుకొండలు, వాసం రమణ, గుడివాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రాంతీయ సదస్సు ఎంతో కీలకం

అధికారులు సమన్వయంతో సదస్సును విజయవంతం చేయాలి
ఏ.పి.ఆర్థిక అభివృద్ధి సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎస్.షణ్మోహన్





కాకినాడ, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, పెట్టుబడులనుఆకర్షించడం,స్థానిక పారిశ్రామిక వేత్తలకు అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా అక్టోబర్ 12 వ తేది న కాకినాడ లోని జేఎన్టీయూ ప్రాంగణంలో ప్రాంతీయ సదస్సు నిర్వహించ నున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎస్.షణ్మోహన్ తెలిపారు.ఆదివారం జేఎన్టీయూ ప్రాంగణంలో ప్రాంతీయ సదస్సు ప్రధాన వేదిక, ఏపీ పెవిలియన్, స్థానిక ఉత్పత్తుల, 'ఒక జిల్లా -ఒక ఉత్పత్తి' (ఓ డి ఓ పి) స్టాల్లు, ఎం ఎస్ ఎం ఈ ఎగ్జిబిషన్ స్టాల్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ముఖ్య అతిథుల సిటింగ్, భోజన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, సి ఐ ఐ ప్రతినిధులు, ఈవెంట్ నిర్వాహకుల తో కలిసి ఎస్. షణ్మోహన్ పరిశీ లించారు.ఈ సందర్భంగా సీ. ఈ. వో మాట్లాడుతూ 31వ భారత పరిశ్రమల సమాఖ్య భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయం తో పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సదస్సుకు హాజరయ్యే అతిథులు, పారిశ్రామిక వేత్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అధికారి తమకు కేటా యించిన విధులు, బాధ్యతలను సమన్వయం తో నిర్వహించాలని, ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.ఈ ప్రాంతీయ సదస్సులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు ఐదు జిల్లాల కలెక్టర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఎం ఎస్ ఎం ఈ ఈ ప్రతినిధులు, స్టార్టప్ నిర్వాహకులు పాల్గొ నున్నట్లు తెలిపారు.సదస్సు ద్వారా ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణ సదుపాయాలు, సింగిల్ డెస్క్ పోర్టల్, వ్యాపార అనుమతుల సరళీకరణ, పెట్టుబడి అవకాశాలు, పెద్ద కంపెనీలతో స్థానిక పరిశ్రమల అనుసంధానం పై ఆసక్తికర చర్చలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక పరిశ్రమలకు కొత్త మార్కెట్ అవకాశాలు కల్పిం చడంతోపాటు, యువతకు ఉద్యోగ అన్వేషకులుగా కాకుండాఉద్యోగప్రదాతలుగా తీర్చిదిద్దేందుకు ఈ వేదిక దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని పారిశ్రామి కవేత్తలు,వ్యాపారులు యువ బెళ్లాపికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామికాభివృద్ధి లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్. గణపతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ. రమణారెడ్డి, సి ఐ ఐ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఐఐ ప్రాంతీయ సదస్సుకు అనుమతి ఉన్న

మీడియాకు మాత్రమే ప్రవేశం

ఐ అండ్ పిఆర్ శాఖ వెల్లడి



కాకినాడ, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : నేడు అనగా సోమవారం 12 వ తేది న కాకినాడ జే ఎన్ టీ యూలో జరగనున్న సిఐఐ ప్రాంతీయ సదస్సు కు మీడియా ఆహ్వానం స్థానిక ఐ అండ్ పి ఆర్ పలికింది. అక్టోబర్ 12 వ తేది సోమవారం కాకినాడ జేఎన్టీయూ లో జరగనున్న సిఐఐ ప్రాంతీయ సదస్సు మీడియా కవరేజ్ నిమిత్తం పాసులు కలిగిన మీడియా ప్రతినిధులకు మాత్రమే అనుమతి కలదన్నారు. ఈ జేఎన్టీయూ ఆడిటోరియం లో జరిగే ప్రాంతీయ సదస్సు కు సంబంధించిన లైవ్ లింకు, ఫోటోలు, పత్రికా ప్రకటన లు సమాచార శాఖ ద్వారా షేర్ చేయబడతాయి. (ఆడిటోరియం నందు ఐ & పి ఆర్ కు మాత్రమే అనుమతి) మీడియా పాసులు (రిపోర్టర్లు,వీడియో గ్రాఫర్లు ఫోటోగ్రాఫర్లు) కలిగిన వారందరూ జేఎన్టీయూ సెనేట్ హాల్ నందు ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వరకు అనుమతి కలదు. ప్రాంతీయ సదస్సుకు సంబంధించిన లైవ్ స్ట్రీమింగ్ ను సెనేట్ హాల్ నందు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రెస్ కాన్ఫరెన్స్ మీడియా పాయింట్ ఏర్పాటు

ఆడిటోరియంలో కార్యక్రమం ముగిసినానంతరం వివిఐపీలు,డెలిగేట్స్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిమిత్తం మీడియా పాయింట్ కు చేరుకొని ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఆడిటోరియంలో కార్యక్రమం ముగిసిన అనంతరం మ.3 గం.ల నుండి ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సందర్శించేందుకు అనుమతి ఉందన్నారు.

కోటనందూరులో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు ప్రారంభం

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన డాక్టర్ కృష్ణారావు



కోటనందూరు, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా కోటనందూరులో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవములు ఘనముగా ప్రారంభమయ్యాయి స్థానిక సింహాద్రి కాలనీ, నంది సెంటర్, మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన మండపాలలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాల ను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ మూడు మండపాలను తుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రెటరీ మరియు ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ వెలగ వెంకటకృష్ణారావు ప్రత్యేక పూజలు జరిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కోటనందూరులో దేవీ నవరాత్రులు జరపడం నేను ప్రత్యేకంగా దర్శించుకోవడం అమ్మవారి అనుగ్రహము అని అమ్మవారి ఆశీస్సులు మా గ్రామం పై ఉండాలని, పాడిపంటలు ఆయుష్ ఆరోగ్యాలు యువతకు విద్యా ఉద్యోగాలు కల్పించి అందర్నీ దీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలియజేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో

అంగరంగ వైభవంగా అమ్మవారి శ్రీచక్ర ప్రతిష్ఠ

నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు
అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



వెల్ల, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రూరల్ మండలం వెల్ల గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో అమ్మవారి శ్రీచక్ర ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిత్విత్ రాయ్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆకుల నారాయణరావు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలి భక్తులు ప్రార్థించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ వైభక్తి ఆధ్యాత్మిక ఔన్నత మనిషికి మానసిక ప్రశాంతతను అందిస్తుందని పేర్కొన్నారు. అలాగే నిర్వహించే పూజలు, పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలి ఆకాంక్షించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్, గెద్దం బాబురావు, వడ్డికూటి ఏసుబాబు, టిడిపి సీనియర్ నేత కంచుమర్తి బాబురావు,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమలాపురం అభివృద్ధికి రూ.20 కోట్లతో రోడ్ల నిర్మాణం

కలెక్టరేట్ వద్ద రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనందరావు



అమలాపురం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : అమలాపురం పట్టణ రూపురేఖలను మార్చేలా రూ.20 కోట్లతో చేపట్టనున్న భారీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) ప్రాజెక్టులో భాగంగా సెంట్రల్ డివైడర్లు, ఆధునిక విద్యుత్ దీపాలతో కూడిన రహదారుల అభివృద్ధి పనులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అమలాపురం పట్టణంలోని సత్యనారాయణ గార్డెన్స్ నుంచి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు, హైస్కూల్ సెంటర్ నుంచి కాలేజ్ వరకు సెంట్రల్ డివైడర్లతో కూడిన రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రహదారులు మరింత సుందరంగా మారనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, గతంలో పట్టణ సుందరీకరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై పాలకులు తగిన దృష్టి సారించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉంది

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలి : ఎమ్మెల్యే ఆనందరావు



అమలాపురం, అక్టోబర్ 11, విశ్వం వాయిస్ న్యూస్ : అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 600 మందికి పైగా బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, టీడీపీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ వస్తోందన్నారు. ఎన్టీ రామారావు హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి నాయకత్వాన్ని ప్రోత్సహించారని గుర్తుచేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు బీసీల రాజకీయ సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూరని తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఆనందరావు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాజ్‌వ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటోందన్నారు. బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేస్తామని ప్రకటించారు.



మండపేట టౌన్, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల "మున్సిపల్ "ఎన్నికల నేపథ్యంలో అధికార కూటమి పార్టీలు (టీడీపీ, జనసేన, బీజేపీ) మరియు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లు తమ వ్యూహ ప్రతివ్యూహాలతో క్షేత్రస్థాయిలో రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. మున్సిపల్ చైర్మన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునేలా (ప్రత్యక్ష ఎన్నికల విధానం) ప్రస్తుత ప్రభుత్వం చట్ట సవరణ తీసుకురావడంతో ఈ ఎన్నికలు ఇరుపక్షాలకు అత్యంత ప్రతిష్ఠాకరంగా మారాయి. అత్యున్నత న్యాయస్థానం తీర్పు మేరకు పురపాలక సంఘం ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు. మండపేటలో ఒక పార్టీ వారు చైర్మన్ అభ్యర్థి బీసీకి మొగ్గు చూపుతుంటే మరొక పార్టీ వారు ఓపెన్ కేటగిరి రిజర్వేషన్ అవుతుందని దీమా వ్యక్తపరుస్తున్నారు. ప్రముఖ డాక్టర్లు సైతం పుర పోరుకు సిద్ధమవుతున్న తరుణంలో శెట్టి బలిజ, తూర్పు కాపులు సైతం చైర్మన్ రేస్ లో ఉన్నాము అనడంతో రిజర్వేషన్ పై ఉన్న ఉత్కంఠత ప్రజల్లో మరింత పెరుగుతుంది. వార్డుల వారిగా రిజర్వేషన్లు ఎస్.సి. – 4 , ఎస్.టి – 1, బిసి – 12, ఓసి – 19 అన్నట్లు గా ఊహాగానాలుతో ఇరు పార్టీల నుంచి ఆశావాహులు వార్డులను ఎంచుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా మండపేట పురప్రజలు మాత్రం ఎప్పుడూ లేని విధంగా పరిపాలన సామర్థ్యం పోరాట పటిమ కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలనే ఆలోచనా విధానంలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. మండపేట చైర్మన్ పీఠం కోసం అధికార ప్రత్యర్థి పార్టీలు మాదంటే మాదంటున్నాయి. 2024 లో ఏ విధంగా అయితే కూటమి పై నమ్మకంతో అసెంబ్లీ ఎన్నికలలో గెలిపించుకున్నారో అదేవిధంగా అధికారంలో ఉన్న కూటమిని స్థానిక ఎన్నికలలో కూడా గెలిపించుకుని మా పై ఉన్న నమ్మకంతో ప్రత్యర్థి వైసిపి ని ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని అధికార కూటమి పార్టీలు ఒకపక్క చెప్తుంటే, రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ సంక్షేమ పాలనతో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ఘన కీర్తిని సంపాదించిన వైసీపీదే మండపేట చైర్మన్ పీఠం అంటూ కూటమి చేసిన తప్పిదాలే "మా గెలుపుకి కూటమికి బీటలు" అని మరోపక్క వైఎస్ఆర్సీపీ చెప్తుంది. ఎన్నికల బరిలో దిగుతున్న రాజకీయ పార్టీల వాదన ఇలా ఉంటే కొన్ని గంటల్లో రాబోయే రిజర్వేషన్లలో మండపేట చైర్మన్ పీఠం తూర్పు కాపు – శెట్టిబలిజ మధ్య ఉంటుందా లేక అగ్రకులాల మధ్య జరుగుతుందా అనే ఉత్కంఠత ప్రజలలో పెరుగుతూ ఉందని సీనియర్ ఓటర్లు, రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మధురపూడి విమానాశ్రయంలో
చిరంజీవికి ఘన స్వాగతం



కోరుకొండ, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రముఖ సినీ నటులు కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రివర్యులు కొణిదల చిరంజీవికి మధురపూడి విమానాశ్రయంలో రాజకీయ ప్రముఖులు అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేసి ఘన స్వాగతం పలికారు. ఆదివారం చిరంజీవి కపిలేశ్వరంలోని జివిఎల్ సూర్య హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన చిరంజీవికి రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఘన స్వాగతం పలుకుతూ పుష్ప గుచ్ఛం అందజేసి సాల్వతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, చిరు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో
మెగా మెడికల్ క్యాంపు



మండపేట టౌన్, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎం) మండపేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మెగా మెడికల్ టెస్ట్ క్యాంపు నిర్వహించారు. పట్ట ణంలోని గాంధీనగర్ అల్ అమీన్ మస్జిద్ వద్ద ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు సంస్థ స్థానిక అధ్యక్షుడు అబ్దుల్ హామీద్ తెలిపారు.ప్రజల ప్రయోజనార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో థైరాయిడ్, కిడ్నీ, షుగర్, లివర్, కొలెస్ట్రాల్ ప్రొఫైల్ పరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర 12 రకాల వైద్య పరీక్షలను అతి తక్కువ ధరలకే అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అధిక సంఖ్యలో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు అందించడమే శిబిరం ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జాబీర్, సభ్యులు కరీమ్, తల్హా, గఫూర్, సిద్దిక్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు వెన్నుపోటు పొడిచింది గొడ్డలి పార్టీయే!

బీసీలకు ఏం చేశారో గొడ్డలి పార్టీ వారు చర్చకు సిద్ధమా? - రాజమహేంద్రవరంలో రెడ్డి సుబ్రహ్మణ్యం ధ్వజం



రాజమహేంద్రవరం, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తీవ్రంగా ఖండించారు. రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు రాజకీయ గుర్తింపు, రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర తెలుగుదేశం పార్టీకే ఉందని పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం చేసిన వారే ఇప్పుడు నీతులు చెబుతూ, ప్రాంతాలవారీగా సమావేశాలు పెట్టి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు రాజకీయ గుర్తింపు

1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నాయకత్వంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని, 1995లో వాటిని 34 శాతానికి పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని రెడ్డి సుబ్రహ్మణ్యం వివరించారు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆయన ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగించేందుకు న్యాయపోరాటం చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

రాజమహేంద్రవరం, సమావేశాలు పెట్టి విమర్శలా?

బీసీలకు తాము ఏం చేశామో చెప్పుకోలేని వైసీపీ నాయకులు రాజమహేంద్రవరంలో సమావేశాలు నిర్వహిస్తూ విమర్శలు చేయడం విమిటని రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు.అదు రీజియన్లలోనూ సమావేశాలు పెట్టడానికి సిద్ధమై విమర్శలు చేస్తూ తిరగడం కాదని, బీసీలకు గతంలో ఏం చేశారో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. "బీసీలకు మీరు ఏం చేశారు? మేము ఏం చేశాము? చర్చకు రండి.. మేము సిద్ధంగా ఉన్నాం" అంటూ సవాల్ చేశారు. వైసీపీ నాయకుల విమర్శలను ఉద్దేశిస్తూ, "బీసీలకు ఏం చేయకుండా ఇప్పుడు గ్రామసింహాల్లా బౌ.. బౌ.. మని మొరుగుతున్నారు" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, రాజకీయ విమర్శలతో బీసీలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు.

50 శాతం పరిమితి సేవభ్యంలో న్యాయపోరాటం

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నర్దేశించిన 50 శాతం పరిమితి కీలకమని పేర్కొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీలకు సాధ్యమైనంత న్యాయం చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. బీసీలకు మెరుగైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం న్యాయపరమైన మార్గాలను పరిశీలిస్తోందని తెలిపారు. స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి అవసరమైన నిధులు పొందడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీ రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు ఆదరణ పథకాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గీత కార్మికులకు మద్యం దుకాణాలు, బార్లలో 10 శాతం రిజర్వేషన్, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలన్న ప్రభుత్వ హామీలను కూడా ప్రస్తావించారు. చెట్టుపై నుంచి పడి మరణించే గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించే అంశాన్ని వివరించారు.

బీసీలకు ఏం చేశారో చర్చకు రండి

బీసీ నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే, సర్దార్ గౌతు లచ్చన్న, దొమ్మేటి వెంకటరెడ్డి, కవయిత్రి మొల్లమ్మ వంటి ప్రముఖులను గౌరవించే కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందని రెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు.బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో ఎవరు ఏం చేశారో బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. విమర్శలు చేయడం సులభమని, కానీ బీసీలకు చేసిన మేలు, జరిగిన నష్టం గురించి వాస్తవాలతో మాట్లాడాలని హితవు పలికారు.

కోరుకొండలో వైభవంగా
ప్రారంభమై శరన్నవరాత్రి మహోత్సవాలు

బాల త్రిపుర సుందరిని దర్శించుకున్న డీఎస్పీ జీవన





కోరుకొండ, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ మండలంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అదివారం శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని పలు గ్రామాల్లో దుర్గమ్మ అలయాల్లో భక్తులు కళకళలాడుతూ అమ్మ వారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. అదివారం అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోరుకొండలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అలయంలో 36వ శరన్నవరాత్రి మహోత్సవం పురస్కరించుకొని ఆలయ వ్యవస్థాపకులు నీరు కొండ బాబ్జి దంపతులు రాజరాజేశ్వరి దేవి కలశ స్థాపన, విశేష కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి జీవన అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దుర్గమ్మ అలయాలన్నీ భవాని భక్తులతో ఎరుపుమయ మయ్యాయి. రాత్రి నరేంద్రవరం వారిచే వెంకన్న బాబు సేవా ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గాదరాడలో కంపెషన్ కేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
పాలు, రొట్టెలు పంపిణీ



కోరుకొండ, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : మండలంలోని గాదరాడ క్రీస్తు సంఘంలో వల్లూరి చిన్నబాబు కంపెషన్ కేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారంలో భాగంగా క్రీస్తు సంఘం సభ్యులకు పాలు,రొట్టెలు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు వల్లూరి చిన్న బాబు తెలిపారు. ఆదివారం క్రీస్తు సంఘంలోని పిల్లలు, వృద్ధులు,మహిళలు మంచి పౌష్టిక ఆహారము తీసుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలని, దీనిలో భాగంగా పాలు, రొట్టెలు అందరికీ అందజేశామన్నారు. ఈ చారిటబుల్ ట్రస్ట్ నిరుపేదలకు అండగా ఉంటూ, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తా మన్నారు. అనంతరం సంఘ సభ్యులు, ట్రస్ట్ వ్యవస్థాపకులు వల్లూరు చిన్నబాబు, ట్రస్ట్ సభ్యులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోరుకొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గొర్రెల రాజు



కోరుకొండ, అక్టోబర్ 12, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు పుల్లెపు వీరన్న కాపు తెలిపారు. ఆదివారం హరే రామ మందిరంలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గొర్రెల రాజు, ఉపాధ్యక్షులు కంచుమర్తి దుర్గారావు, బొడ్డేటి నాగేశ్వరరావు, సెక్రటరీ కుంచె వినోద్, కోశాధికారి ఊర సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీ సూరిశెట్టి రాంబాబు, గౌరవ సలహాదారులు కుమ్మరి వెంకటేశ్వరరావు, అడివారపు కన్నారావు, కదియాల పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు గొర్రెల రాజు మాట్లాడుతూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



సంఘ అభివృద్ధికి కృషి చేద్దామని, సంఘ భవన నిర్మాణానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మాగుపు వెంకటరమణ, కుంచే నరసింహారావు, కొయ్య దొరబాబు, కత్తి శ్రీను, కాండ్రేగుల రఘు, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.





చేసింది ఒకే ఒక్క సినిమా..

కుర్రాళ్ల గుండెల్లో బాణాలు గుచ్చింది ఈ ముద్దుగుమ్మ

సినిమా ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్ల ఎంట్రీకి ఎప్పుడూ కొదవ ఉండదు. ప్రతి ఏడాది కొత్త అందాలు వెండితెరపై సందడి చేస్తుంటాయి. ముఖ్యంగా ఇతర భాషల నుంచి వచ్చిన భామలు టాలీవుడ్‌లో అవకాశాలు అందుకుంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇక సోషల్ మీడియా ద్వారా పాపులర్ అవుతున్న అమ్మాయిలకు కూడా సినిమా అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్ల ఎంట్రీకి ఎప్పుడూ కొదవ ఉండదు. ప్రతి ఏడాది కొత్త అందాలు వెండితెరపై సందడి చేస్తుంటాయి. ముఖ్యంగా ఇతర భాషల నుంచి వచ్చిన భామలు టాలీవుడ్‌లో అవకాశాలు అందుకుంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇక సోషల్ మీడియా ద్వారా పాపులర్ అవుతున్న అమ్మాయిలకు కూడా సినిమా అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. అలా ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన పేరు ఆరాధ్య దేవి. సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదగాలంటే వరుసగా సినిమాలు చేయాలి.. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలి. కానీ కొంతమంది మాత్రం ఒక్క సినిమాతోనే అందరి దృష్టిని తమవైపు తిప్పుకుంటారు. ఇప్పుడు ఆరాధ్య దేవి కూడా ఇదే కోవలోకి వస్తోంది. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫొటోలు, వీడియోలతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ భామ పేరు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. అందం, గ్లామర్‌తో యువతను ఆకట్టుకుంటున్న ఈ అమ్మడు.. సినిమాల్లో ఎలాంటి పాత్రలైనా చేయడానికి సిద్ధమని చెప్పడం మరోసారి ఆసక్తికరంగా మారింది. దీంతో ఈ బ్యూటీ గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఆరాధ్య దేవి అసలు పేరు శ్రీలక్ష్మి సతీష్. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న ఈ భామను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన సినిమాలో కథానాయకగా పరిచయం చేశారు. సోషల్ మీడియాలో ఆమె వీడియోలు చూసిన వర్మ.. ఆమెను హీరోయిన్‌గా తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆమెతో 'శారీ' (శుభోదయ) సినిమాను రూపొందించారు. ఈ చిత్రంతో ఆరాధ్య దేవి పేరు సినిమా ప్రేక్షకులోనూ చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆమె గ్లామర్ లుక్, స్ట్రీమ్ డ్రెజెస్‌తో సోషల్ మీడియాలో మంచి గుర్తింపు సంపాదించుకుంది. సోషల్ మీడియాలో రీల్స్ చేసే సమయంలో సంప్రదాయబద్ధమైన దీరకట్టులో కనిపించిన ఆరాధ్య దేవి.. సినిమాల్లో మాత్రం గ్లామరస్ లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో ఆమె పాత పీడియోలు, తాజా ఫొటోలను పోలుస్తూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు సోషల్ మీడియా ద్వారా వచ్చిన గుర్తింపును సినిమా అవకాశాలుగా మార్చుకోవడం ఈ రోజుల్లో కొత్త విషయం కాకపోయినా.. ఆరాధ్య దేవి విషయంలో మాత్రం ఆమె గ్లామర్, సినిమాల ఎంపికపై ఆసక్తి నెలకొంది. ఇకపై ఎలాంటి కథలు, పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తుందో చూడాలి. గ్లామర్ పాత్రల విషయంలో తన ఆలోచనలు మారాయని ఆరాధ్య దేవి గతంలో చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఒకప్పుడు గ్లామరస్ పాత్రలు చేయకూడదని అనుకున్నప్పటికీ, ఇప్పుడు తన అభిప్రాయాలు మారాయని ఆమె చేర్నొన్నట్లు సమాచారం. గ్లామర్ అనేది వ్యక్తిగతమైన విషయమని, అది తన వృత్తిలో భాగమని ఆమె అభిప్రాయపడినట్లు ప్రచారం జరిగింది. గ్లామరస్ పాత్రలైనా, ఇతర విభిన్నమైన పాత్రలైనా తనకు వచ్చిన అవకాశాన్ని బట్టి నటించడానికి సిద్ధమనే సంకేతాలు ఇచ్చింది.



రణబాలి నుంచి కోబలి సాంగ్..

విజయ్ దేవరకొండ తాండవం చూశారా..



తెలుగు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో రణబాలి ఒకటి. రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి వచ్చే అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సినిమా ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. తాజాగా ఈ మూవీ నుంచి రెండో పాట కోబలిని విడుదల చేసింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ వరుసగా ప్రమోషనల్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై ఆసక్తిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని రెండో పాట 'కోబలి' లిరికల్ వీడియోను యూట్యూబ్‌లో విడుదల చేశారు. అయితే ఈ పాటను ముందుగా స్పాటిఫైలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు యూట్యూబ్‌లోనూ లిరికల్ వీడియోను విడుదల చేయడంతో ప్రేక్షకులకు మరో అప్‌డేట్ అందించినట్లయింది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఈ పాటను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తోంది. 'కోబలి' పాట విడుదలకి పవర్‌ఫుల్‌గా సాగుతూ ఆకట్టుకుంటోంది. ఇందులోని సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అర్థవంతమైన పదాలతో సాగిన లిరిక్స్ శ్రోతలను ఆకట్టుకునేలా ఉన్నాయి. సినిమా నేపథ్యానికి తగినట్లుగా ఈ పాటను రూపొందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న 'రణబాలి'లో ఈ పాట ఎలాంటి సందర్భంలో వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతాన్ని అందిస్తున్నారు. వీరి సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్‌పై ఆసక్తి చూపిస్తున్న ప్రేక్షకులకు 'కోబలి' పాట మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. పీరియడ్ జోడీని మరోసారి తెరపై చూడాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సినిమా పాటలు, ఇతర ప్రమోషనల్ కంటెంట్ ద్వారా ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు. అక్టోబర్ 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండటంతో రాబోయే రోజుల్లో మరిన్ని అప్‌డేట్స్ వచ్చే అవకాశం ఉంది. మరి ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాతో విజయ్ దేవరకొండ ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.



ఇండోర్‌లో టీమిండియాదే విక్టరీ.. సిరీస్‌లో ఆధిక్యం..



భారత జట్టు వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరితమైన మూడో ;20 మ్యాచ్‌లో టీమిండియా 14 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించి ఘన విజయాన్ని సాధించింది. ఈ విజయంతో సిరీస్‌లో భారత్ తన ఆధిక్యాన్ని మరింత బలపరుచుకుంది. ఇండోర్‌లో జరిగిన భారత్, వెస్టిండీస్ మూడో టీ20లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది.

అభిషేక్ శర్మ విధ్వంసం.. భారత్‌కు భారీ స్కోరు..

భారత్ ఇన్నింగ్స్‌లో అభిషేక్ శర్మ 30 బంతుల్లో 69 పరుగులతో చెలరేగాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఇషాన్ కిషన్ 37 పరుగులతో కీలక సహకారం అందించాడు. తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ కూడా ఉపయోగకరమైన పరుగులు చేయడంతో భారత్ 223 పరుగుల భారీ స్కోరును సాధించింది.

వెస్టిండీస్ పోరాటం.. చివర్లో అర్ష్‌దీప్ దెబ్బ..

224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు మధ్య ఓవర్లలో కొంత ప్రతిఘటన ఎదురైంది. షిమ్రాన్ హెట్‌మేయర్, కైల్ మేయర్స్? కాదు - అందుబాటులో ఉన్న మ్యాచ్ వివరాల ప్రకారం హెట్‌మేయర్, కిమో పాల్ తదితరులు పోరాడారు. అయితే భారత బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. ముఖ్యంగా అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మ్యూవ్ చివరి దశలో షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌ను బౌల్డ్ చేయడం ద్వారా వెస్టిండీస్ విజయావకాశాలను దెబ్బతీశాడు. చివరికి వెస్టిండీస్ 209/7 వద్దే ఆగిపోయింది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో గెలిచి మూడో టీ20లో విజయాన్ని అందుకుంది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన అద్భుతమైన బౌలింగ్‌కు విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (5) త్వరగానే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత కమిల్ పూరన్ (42), షిమ్రోన్ హెట్మెయర్ (43) దూకుడుగా ఆడి మ్యాచ్‌ను గెలిపించే ప్రయత్నం చేసినప్పటికీ, భారత బౌలర్లు సమయానికి వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పారు. చివరి వరకు హోరాహోరీగా సాగిన ఈ పోరులో వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ కీలకమైన 3 వికెట్లు తీసి విండీస్ పతనంలో కీలక పాత్ర పోషించగా, నమన్ ధీర్ 2 వికెట్లు దక్కించుకున్నారు.

టీ20 క్రికెట్ హిస్టరీలోనే తొలి టీంగా వెస్టిండీస్ భారీ రికార్డ్..



టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో వెస్టిండీస్ మరో అరుదైన మైలురాయిని అందుకుంది. ఇండోర్‌లో భారత్‌తో జరిగిన 3వ టీ20లో ఆ జట్టు 2,000 సిక్సర్ల మార్క్‌ను దాటింది. దీంతో పురుషుల టీ20ఐ చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా వెస్టిండీస్ నిలిచింది. భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది. టీ20 క్రికెట్ అంటేనే భారీ షాట్లు, సిక్సర్ల వర్షం. ఈ ఫార్మాట్‌లో ఆరంభం నుంచే పవర్ హిట్టింగ్‌కు పేరుగాంచిన వెస్టిండీస్ ఇప్పుడు దాన్ని గణాంకాల్లోనూ నిరూపించింది. ఇండోర్‌లో భారత్‌తో జరిగిన మూడో టీ20ఐకి ముందు అందుబాటులో ఉన్న గణాంకాల్లో వెస్టిండీస్ 1,997 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉంది. భారత్ 1,989 సిక్సర్లతో రెండో స్థానంలో ఉంది. ఈ గణాంకాలు వెస్టిండీస్, భారత్ మధ్య సిక్సర్ల పోటీ ఎంత దగ్గరగా ఉందో చూపిస్తున్నాయి. ఇండోర్ మ్యాచ్‌లో వెస్టిండీస్ 2,000 మార్క్‌ను దాటడంతో కొత్త చరిత్ర నమోదైంది. ఇక్కడ 1,997/1,989/1,585 వంటి బేస్ గణాంకాలు అందుబాటులో ఉన్న సమగ్ర గణాంక పట్టిక నుంచి తీసుకున్నవి; వెస్టిండీస్, భారత్ 2026లో ఆ తర్వాత ఆడిన మ్యాచ్‌లతో తాజా సంఖ్యలు మారాయి. పాత పట్టికలో ఇంగ్లండ్ 1,406, ఆస్ట్రేలియా 1,400 సిక్సర్లతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి. అందువల్ల టాప్-5 క్రమం విషయంలో మీ సమాచారం సరైనదే: వెస్టిండీస్, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా.

వెస్టిండీస్ ఎందుకు ముందుంది?

వెస్టిండీస్ బ్యాటింగ్ సంస్కృతిలోనే పవర్ హిట్టింగ్ ఒక ప్రధాన భాగం. క్రిస్ గేల్, కీరన్ పొలార్డ్, నికోలస్ పూరన్, ఎవిన్ లూయిస్, రోవ్‌మన్ పావెల్ వంటి భారీ హిట్టర్లు ఆ జట్టు సిక్సర్ల సంఖ్యను భారీగా పెంచారు. ముఖ్యంగా నికోలస్ పూరన్ వెస్టిండీస్ తరపున టీ20ఐల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లోనే అతడు క్రిస్ గేల్‌ను అధిగమించి వెస్టిండీస్ తరపున టీ20ఐల్లో అత్యధిక సిక్సర్ల రికార్డును అందుకున్నాడు. అఎఎ పూరన్ తన టీ20ఐ కెరీర్‌లో 149 సిక్సర్లు కొట్టాడు. రోవ్‌మన్ పావెల్, ఎవిన్ లూయిస్ కూడా వెస్టిండీస్ పవర్-హిట్టింగ్‌లో కీలక పాత్ర పోషించారు.

రెండో స్థానంలో భారత్..

వెస్టిండీస్ 2,000 మార్క్‌ను అందుకున్నా.. భారత్ కూడా వెనుకబడలేదు. 2026లో భారత బ్యాటింగ్‌లో సిక్సర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ఐ మ్యాచ్‌ల సిరీస్‌లోనే భారత్ 69 సిక్సర్లు కొట్టింది. ఇది పూర్తి సభ్య దేశం ఒక ద్వైపాక్షిక టీ20ఐ సిరీస్‌లో కొట్టిన అత్యధిక సిక్సర్లుగా నమోదైంది. అంతేకాదు, న్యూజిలాండ్‌తో తిరువనంతపురంలో జరిగిన 5వ టీ20ఐలో భారత్ 23 సిక్సర్లు కొట్టింది. ఇదే భారత్‌కు ఒక టీ20ఐ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లలో ఒకటి.

వెస్టిండీస్‌కు సిక్సర్లలో మరో ప్రత్యేకత..

ఒక టీ20ఐ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డుల్లోనూ వెస్టిండీస్ పేరు ఉంది. 2023లో దక్షిణాఫ్రికాపై వెస్టిండీస్ 22 సిక్సర్లు బాదింది. 2016లో భారత్‌పై లాడర్‌హిల్‌లో 21 సిక్సర్లు కొట్టింది. 2026 రావీ టీ20ఐలో భారత్‌పై వెస్టిండీస్ మరోసారి 20 సిక్సర్లు కొట్టింది. ఆ మ్యాచ్‌లో మొత్తం 501 పరుగులు నమోదయ్యాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 2,000 సిక్సర్ల మైలురాయిని అందుకున్న తొలి జట్టుగా వెస్టిండీస్ నిలవడం ఆ జట్టు పవర్ హిట్టింగ్ సంప్రదాయానికి నిదర్శనం. అయితే భారత్ కూడా కేవలం కొన్ని సిక్సర్ల దూరంలోనే ఉండటంతో ఈ రికార్డు పోరు ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. ప్రస్తుత భారత బ్యాటింగ్ దూకుడు కొనసాగితే త్వరలోనే టీమిండియా కూడా 2,000 మార్క్‌ను అందుకోవడం ఖాయం. ఇండోర్‌లో జరిగిన ఈ మ్యాచ్ ఈ సిక్సర్ల పోరులో మరో ముఖ్యమైన అధ్యాయంగా నిలిచింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సిల్వర్ స్క్రీన్ CINEMA
కైలాస వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్థ వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్థ వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com